## మనోహరా వారి

# 'మనోహర'


''తివిరి రామునిబాణమ్ము
త్రిప్పవచ్చు,
పటిపోటున కైకు కత్తి
యీడవచ్చు,
బట్టతలమీద జుట్టు
రాబట్టవచ్చు,
ఆడదాని ఆశనుబట్టి
ఆపలేము.''

అని మనోహరవారి "మనోహర"లో ఒక్క తేటగీతి పద్యం ఉంది. 'ఇందులో ఆఖరి పాదం తీసి వేసి 'ప్రేక్షకుల అభిరుచి కనిపెట్టలేము' అని చేరిస్తే బాగుంటుందేమో.

"మనోహర" తమిళ చిత్రం తమిళ దేశంలో పెద్ద విజయం పొందింది. తెలుగు చిత్రం కూడా తెలుగు దేశంలో బాగా పోతోందనీ, ప్రజలు ఆనందిస్తున్నారనీ తెలుస్తోంది.



బి. ఏ. సుబ్బారావుగారి 'రాజు-పేద'లో రేలంగి, అమ్మాజీ.



"అన్నదాత" లో రైతులందర్నీ సమష్టి క్షేమంకోసం సమీకరిస్తున్న నాగేశ్వరరావు.

# 'మనోహర'

ఈమధ్య ఏ జానపద చిత్రానికీ అంత పలకడం లేదు. అందుచేత జానపద చిత్రాలు ఈ కాలప్పువాళ్ళ వొంటికి పడవని అనుకున్నారు. అయితే ప్రేక్షకులకు కావలసిన వినోదాన్ని తెలివితేటలతో సప్లయిచేసే ఏ బాపతు చిత్రాన్నైనా ప్రజలు ఆదరిస్తారనీ, "మనోహర"లో "ఆ వినోదమే" ఉందనీ ఋజువౌతున్నది.

ఈ చిత్రాన్ని ప్రసాద్ గారు డైరెక్టు చేశారు. తమిళ చిత్రం మంచి విజయం పొందడంతో ప్రసాద్ గారు ఇటీవల కోల్పోయిన ప్రతిష్ఠ తిరిగి రావడం, ఆయనకు బాక్సాఫీసు చిత్రాలు తీయడం చేతకాదన్న అభిప్రాయం కొంతవరకూ తొలగిపోవడం జరిగింది.

చోళదేశానికి రాజు పురుషోత్తముడు. ఆయన భార్య పద్మావతి. వారికి మనోహరుడనే కొడుకు. అందరూ జానపద రాజుల వలెనే ఈ రాజు మంచివాడైనా, సులభంగా మోసానికి పడిపోయే రకం. రాణి పతివ్రతా మాహాత్మ్యం నిరూపించడం కోసమే పుట్టిన సాధ్వి. రాజుగార్ని వలలో వేసుకొని రాజ్యపాలనలో దురాశతో వసంతసేన అనే మాయలాడి నర్తకిగా ఆస్థానంలో ప్రవేశించి రాజును వశపరచుకొంటుంది. రాజుగారు వసంతసేన వలలో పడి రాణీవాసం మానేస్తాడు. వసంతసేన తన భర్తయైన కేసరివర్మకు విషం పెట్టి నదిలో పడవేయిస్తుంది. కాని ఒక సిద్ధుడు అతన్ని రక్షించి తన విద్యలన్నీ అతనికి నేర్పుతాడు. ముఖ్యంగా కేసరివర్మ తిరస్కరిణీ విద్య నేర్చుకుంటాడు. ఈ విద్య సహాయంతో అతడు ఎవరికీ కనిపించకుండా ఉండవచ్చు. దీనితోనే అతడు ద్రోహం చేసిన వసంతసేన మీద కసి తీర్చుకోవాలనుకుంటాడు కేసరివర్మ. అయితే, ముందే ఆమెను చంపేస్తే కథ ఆగిపోతుంది గనుక సినిమా ఆఖరుదాకా వేచివుంటాడు.

ఇలాగ 18 ఏళ్ళు గడుస్తాయి. మనోహరుడూ పెద్దవాడౌతాడు. అతని 18వ జన్మదినోత్సవం వేడుకలు జరుగుతూంటాయి. ఆ సందర్భంలో కేసరివర్మ రాజుకు వసంతసేన పట్ల అయిష్టం కలగజేసే ఉద్దేశంతో ఒక నాటక బృందంతో వచ్చి రాజసభలో ఒక నాటకం వేస్తాడు. ఆ నాటకంలో వసంతసేన తన భర్తను చంపి రాజుగార్ని ఎలా వశపరచుకొంది అన్యాపదేశంగా చూపిస్తాడు. నాటకం చూసిన తర్వాత రాజుకు కొద్దిగా అనుమానం కలుగుతుంది గాని వసంతసేన తన మాయమాటలతో అతన్ని మళ్ళీ నమ్మిస్తుంది.

ఈ నాటకంలో మనోహరుడు కందా మోహన్ యోధా బాలుడుగా చూపబడ్డాడు. ఆ తరవాత 18 ఏళ్లు జరుగుతాయి. 18 ఏళ్లు జరిగిన తరవాతకూడా మనోహరుడికి ఇంకా 18వ జన్మదినోత్సవమే ఎలా జరుగుతోందో తెలియదు. ఏమైతే నేం, ఈ నాటకంద్వారా మనోహరుడికి తన తండ్రిని వసంతసేన వలలో పడడం, తన తల్లికి అన్యాయం జరగడం తెలుస్తుంది. అతడు వసంతసేనను హతమారుస్తానని బయలుదేరతాడు. కాని తల్లి పతిసుఖమే తన సుఖమని భావించేది కనుక కొడుకును వారిస్తుంది.

మనోహరుడు తల్లి ఆజ్ఞతో, తన మాతామహుని రాజ్యం ఆక్రమించిన ముత్తు విజయుడనే రాజుపైకి యుద్ధానికి వెళ్లి ఆ రాజుని చంపి, రాజకుమార్తెని వివాహం చేసుకుని ఇంటికి తిరిగివస్తాడు. యుద్ధసమయంలో మనోహరుణ్ణి హత్య చేయించడానికి వసంతసేన చేసిన ప్రయత్నం విఫలమై ఆ సంగతి మనోహరుడికి తెలుస్తుంది. వెంటనే వసంతసేనను చంపడానికి బయల్దేరుతాడు. మళ్ళీ తల్లి అడ్డుపడుతుంది. ఈవిధంగా రాణి చాలాసార్లు అడ్డుపడి కథను చివరదాకా రక్షించుకుంటూ వస్తుంది.

వసంతోత్సవాలు జరుగుతూ ఉంటాయి. ఆ సమయంలో వసంతసేన మనోహరుణ్ణి కులట పుత్రుడని తిడుతుంది. అది విని రాజుగారికి కూడా కష్టం కలుగుతుంది. కాని రాజు మనస్సు మార్చడానికి వసంతసేన ఒక పన్నాగం పన్నుతుంది.

వసంతోత్సవంలో వసంతసేన మనోహరుణ్ణి కులట పుత్రుడని అంటుంటే ఎందుకూరుకున్నావని నిందించడానికి గాను రాణీగారు మంత్రి సత్యశీలుణ్ణి అర్ధరాత్రి వేళ తన అంతఃపురానికి పిలిపిస్తుంది. రాత్రి వేళ రహస్యంగా పిలిపించడమెందుకని మన కాశ్చర్యం కలగవచ్చును గాని, రాణీ కులట అని రాజుగారికి నిరూపించడానికి వసంతసేన కింతకంటె మంచి అవకాశం చిక్కుతుందా! రాణీ, సత్యశీలుడు ఒంటరిగా ఉండడం చూసి రాజుగారు భార్య వ్యభిచారిణి అని నమ్ముతాడు. మర్నాడు రాణిని, గర్భిణియైన మనోహరుడి భార్య విజయను చెరసాలలో బంధిస్తాడు. మనోహరుణ్ణి వధించమని ఆజ్ఞాపిస్తాడు. తండ్రి మాటను శిరసావహించమని తల్లి ఆజ్ఞాపించినందువల్ల ఎదిరించగలిగి ఉండికూడా మనోహరుడు తన శిక్షను అంగీకరిస్తాడు. (అయితే రాజుగారు తన భార్యతో వ్యభిచరిస్తున్నాడని అనుమానించిన సత్యశీలుణ్ణి క్షమించాడో ఏమోగాని అతన్నేమీ చెయ్యడు.)

వధ్యస్థానానికి తీసుకుపోబడుతున్న మనోహరుణ్ణి అంతర్ధానుడై ఉన్న కేసరివర్మ రక్షించి తన గుహకు తీసుకుపోతాడు.

ఇక్కడ వసంతసేన తన కొడుకైన వసంతుణ్ణి యువరాజు చేయమని కోరుతుంటే, కాని ఆ పిచ్చివాడికి రాజ్యం ఇవ్వడానికి రాజు ఒప్పుకోడు. అప్పుడామె తన పాత విటుడైన ఉగ్రసేనుడనే రాజును సేనాసమేతంగా పిలిపించి రాజును బంధిస్తుంది. ఈ సంగతి తెలిసి మనోహరుడు, కేసరివర్మ సమయానికివచ్చి రాజును, రాణిని, విజయను, ఆమెకు చెరసాలలో పుట్టిన పసిబిడ్డను అందర్నీ రక్షిస్తారు. ఉగ్రసేనుడు చస్తాడు. వసంతసేనను కేసరివర్మ ముక్కలు ముక్కలుగా నరికి పగతీర్చుకుంటాడు. రాజు పశ్చాత్తాపపడతాడు. ఆ పిమ్మట అంతా సుఖంగా ఉంటారు.

బాక్సాఫీసు చిత్రాల కుండవలసిన లక్షణాల్లో ఏ ఒక్కదాన్నీ విడిచి పెట్టలేదు డైరెక్టరుగారు. కథలో విరివిగా సంఘటనలున్నాయి. ముందేమి జరుగుతుందా అనే ఉత్కంఠ ప్రేక్షకునికి అడుగడుగునా కలుగుతుంది. శివాజీ గణేశన్ మాటమాటకీ కత్తి దూయడం, ఇనపగొలుసులు తెంచుకోవడం, కత్తియుద్ధాలు చెయ్యడం వగైరా స్టంటులతో వీరరసం సృష్టిస్తాడు. అంతర్ధానుడై ఉన్న కేసరివర్మ అద్భుతరసం, వివిధ పాత్రల నడతలపైన వ్యాఖ్యానం చేస్తూ వసంతుడనేవాడు హాస్యరసం, కన్నాంబ గారు కరుణరసం, పి. కె. సరస్వతి సెక్సప్పీలు సప్లయిచేస్తారు. ఇలాగ యథాశక్తి అంతా తలొక రసం కలగజేస్తారు. కనుక కథవిషయంలో డైరెక్టరుగారేమీ తప్పు చెయ్యలేదు. శివాజీ గణేశన్ మేకప్ కొంచెం వెగటుగా ఉన్నా, అతడు ప్రదర్శించే స్టంటుల మూలాన్న [illegible] ఎవరూ పట్టించుకోరు. కన్నాంబకు చాలా రోజులతరవాత తగినపాత్ర లభించినట్లుంది. రాజకుమారికూడా బాగా నటించింది.

స్వర్గీయ బలిజేపల్లి వ్రాసిన సంభాషణలు నాటక ఫక్కీలో ఉండడం ఈ కథకు, ఈ పాత్రలకు నిండుదనం తెచ్చింది. [illegible] వడిచే సమాసశైలి ఇలాంటి అభూతకల్పనా కథలకు బాగా సరిపోతుంది. అందులో గుగ్గయ్య కంఠాన్ని తలపించే జగ్గయ్య కంఠం, నిర్దుష్టమైన వడిగలిగిన ఉచ్చారణ గణేశన్ అభినయానికి అతికినట్లు సరిపోయాయి.

పాటలు బలిజేపల్లి, ఆత్రేయ, శ్రీశ్రీ వ్రాశారు. పాటల్లో తగుమాత్రంగా అశ్లీలాలు పడ్డాయి. "ప్రేక్షకుల అభిరుచి కనిపెట్టలేము" అని ఇందాక అనుకున్నట్లు

గానే, "క్షణక్షణముల్ సెన్సార్ల చిత్తముల్" అని మరొక అర్థాంతర న్యాసం చేయవచ్చు. ఈ సెన్సారున్నారే, వీరికి విశ్వ జ్ఞాన ఏది అశ్లీలంగా తోస్తుందో, ఏది సుశ్లీలంగా తోస్తుందో చెప్పడం బ్రహ్మతరం గాదు.

"అది అసలే నీలో లేదా?
మరి పుట్టుకతోనే దేవుడు
నిన్ను బట్టబయలుగా
వదిలేశాడా?"

అనే పాట సెన్సార్లకు అర్థమై ఉండదు. ఒక వేళ అర్థమైతే, మంచి నాజూకైన మాట లనుకుని వదిలేసి ఉంటారు

తక్కినవాటి సంగతి దేవు డెరుగును గాని, 'ఎంటర్టెయిన్మెంట్' పుష్కలంగా కలిగిన యీ చిత్రం నిర్మాతలకు లాభాలు చేకూర్చి పెడుతుందని ఆశించవచ్చు. ★

# ★ సినిమా వార్తలు ★

## కొత్త టెక్నిక్

పర్స్పెక్టా - స్టీరియో ఫోనిక్ సౌండ్ అనే కొత్త టెక్నిక్‌ను ఎమ్. జీ. ఎమ్, పారమౌంట్, వార్నర్ బ్రదర్స్ కంపెనీల వారు అవలంబించారు ఈ టెక్నిక్ న్యూయార్కులో గత ఏప్రిల్‌లో ప్రదర్శింపబడింది ఈ టెక్నిక్‌ను వివరీకరిస్తూ కొన్ని దృశ్యాలు, ఎమ్. జీ. ఎమ్ వారు తీసిన చిత్రాల్లోని కొన్ని దృశ్యాలు చూపించబడినప్పుడు చాలా ప్రశంసలు వచ్చాయట. ఈ టెక్నిక్‌లో ఉన్న విశేష మేమంటే, స్టీరియో ఫోనిక్ శబ్దం రికార్డు చేయడానికి వేరు వేరు ట్రాక్‌లు కాక, ఒకే ట్రాక్ ఉపయోగించబడుతుంది. ఈ టెక్నిక్‌లో తీయబడిన చిత్రాలకోసం థియేటర్లలో ఎట్టిమార్పులూ చెయ్యవక్కరలేదట.


* * *

ప్రతిభావారి చిత్రం (రేచుక్క) షూటింగు సగం తయారైంది. జూన్, జూలై నెలల్లో నిర్విరామంగా నెప్ట్యూన్, రేవతీ స్టూడియోలలో వరసగా సెట్లువేసి, ఆగస్టు కల్లా చిత్రం పూర్తిచేసి, ఆనెలలోనే విడుదలచేయాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారు.

* * *

"రాజూ - పేద" బహుశా ఈ నెల 18వ తేదీన విడుదలచేస్తామని నిర్మాత, దర్శకుడు బి. ఏ. సుబ్బారావుగారు చెబుతున్నారు.

* * *



మోహన్‌స్టూడియో (బొంబాయి)లో "మొఘల్-ఇ-ఆజాం" సెట్‌లో ఒకభాగం.

భారత చలన చిత్ర నిర్మాతల సంఘం (బొంబాయి) వారి 16వ వార్షిక సమావేశంలో ప్రముఖ నిర్మాత దల్ సుఖ్ ఎమ్. పాంచోలీ అధ్యక్షుడుగా ఎన్నికోబడ్డారు. ప్రముఖ నిర్మాతలైన శాంతారాం, మెహబూబ్, కర్దార్, సొహరాబ్ మోడీ, వాడియా, రాజ్ కపూర్, ఎస్. జె భట్, తోలారాం జలాన్, బాబూరావ్ పాయ్ ఈ సంఘంనుండి ఇటీవలనే రాజీనామా ఇచ్చారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వీరుడు టెన్సింగ్ నార్కే, హాలీవుడ్‌లో ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్‌వారి "సేబర్ టూత్" అనే చిత్రంలో నటించడానికి అంగీకరించాడు. ఈ చిత్రంకోసం ఎవరెస్ట్ శిఖరాన్ని పరిసరదృశ్యాలను విమానాలపైనుంచి షూట్ చేస్తారట.

* * *

సినిమాపరిశ్రమకు ఆర్థికంగా దోహద మిచ్చే బదులు ప్రభుత్వం పరిశ్రమను మరింత తమ అదుపులోకి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నదని ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ ఎసోసియేషన్ కొత్త అధ్యక్షుడు దల్‌సుఖ్ పంచోలీ అన్నారు. నేషనల్ ఫిల్మ్ బోర్డును స్థాపించడానికి నిశ్చయించినట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ, ఫిల్మ్ ఇంక్వైరీ కమిషన్ నివేదికలో సినిమాపరిశ్రమను బలపరిచే అంశాలను మాత్రం ప్రభుత్వం నిరాకరించిం